# ప్రతీకారం

[ పి. హరిప్రసాదరావు ]

రెండు నెలలు కష్టపడి సూర్యాన్ని పూర్తిగా వశపరచుకుని తనకోర్కె నెరవేర్చుకోగలిగింది రవణమ్మ. పాతికేండ్ల సూర్యం నలభై సంవత్సరాల రవణమ్మ వలలో చిక్కి ఆమె బాహుపంజరంలో బంధితుడై పోయాడు. మొదట సూర్యం, ఆమె తన వంక జాలిగా 'నన్ను కరుణించి నాకోర్కె తీర్చవా!' అన్నట్టుగా చూచేచూపులూ, తనను ఆకర్షించడానికి ఆమెచేసే చేష్టలూ చూచి అసహ్యించుకున్నాడు. భర్తా, నలుగురుపిల్లలూగల ఆమె తనపై అనురాగాన్ని ప్రకటించడానికి ఆశ్చర్యపోయాడు. ఎంత అసహ్యించుకున్నా సూర్యం ఓడిపోయాడు. కారణం! ఆమె అతనిని ఆకర్షించడానికి చేసేప్రయత్నాలు, అతనిపైచూపే ఆదరణ, అతని బ్రహ్మచర్యం అన్నింటికీ మించిన ఆమె శరీరసౌందర్యం అన్నీ కలిసి సూర్యాన్ని కాముకుణ్ణిచేశాయి. ఏదో విధంగా సూర్యం వోడిపోయాడు. రవణమ్మే గెలిచింది.

రవణమ్మదీ, సూర్యానిదీ యెదురుబదురు యిళ్ళుకావడంవలన రవణమ్మ భర్తా, బిడ్డలూ సూర్యానికి పరిచితులుకావడంవలన ఏదో ఒక వంకతో రవణమ్మ యింట్లో యెక్కువకాలం గడపడానికి చాలా వీలయింది.

రానురాను సూర్యం పూర్తిగా ఆమెకు లోబడిపోయాడు. ఆమె నిలబడుమన్నచోట నిలబడడము, కూర్చోమన్నచోట కూర్చోడమువరకు వచ్చింది అతని పరిస్థితి. ఆవిధంగా సూర్యం పూర్తిగా వశుడైపోవడము రవణమ్మకు గర్వకారణమైంది. అతనిని కాముకవ్యాపారంలో తప్ప యితర విషయములలో చాలనీచంగా చూడనారంభించింది. ఆమె యెలాచూచినా నన్ను కామిస్తేచాలు అదే పదివేలు అనుకుంటుండేవాడు సూర్యం. ఆ పరిస్థితులలో అతనికి యితర బంధువులూ, స్నేహితులూ అవసరంలేకపోయారు. సర్వకాల సర్వావస్థలయందూ అతనికి రవణమ్మ స్వరూపమే కనబడుతూండాలి.

సూర్యంతల్లి అతనికి పెండ్లిచేయాలని చాలా ప్రయత్నించింది. కాని సూర్యం వింటేగా ఆమెమాట! అతనికి రవణమ్మే భార్య, బంధువు, దేవలా కనుపించేది. కాని, తను యెన్నోవాడో వూహించుకోలేకపోయాడు.


USE ALWAYS "R. C." ASAFOETIDA.

చాలరోజులు వారిరువురి కాముకవ్యాపారం బాగా నేసాగింది. ఇంట్లో వాళ్ళకళ్ళకు కారంకొట్టి సూర్యంతో రతిక్రీడలో మునిగి తేలుతూండేది రవణమ్మ. కాని, చంచలమైన మనస్సుకలవాళ్ళు ఒక్కనితో యెంతకాలం సంతుష్టిపడతారు. రానురాను రవణమ్మకు సూర్యంపైనున్న మోజు తగ్గిపోసాగింది. అయిష్టంతోనే కొంతకాలం అతనితో గడిపింది గతిలేక. ఆఖరికి ఖచ్చితంగా చెప్పింది "నీవు నాయింటికి రావద్దు" అని. మొదట సూర్యం అది వేళాకోళాని కనుకున్నాడు. కాని, ఆమె ప్రవర్తన కనిపెట్టి వాళ్ళయింటికివెళ్ళడం మానుకున్నాడు. రవణమ్మను మరచిపోదామని చాల ప్రయత్నించాడు. మరువలేక పోయేవాడు.

రవణమ్మ పంజరంలో మరోయువక పక్షి బంధింపబడింది. అతనితో ఆమె హాయిగా...

ఇప్పుడు సూర్యం రవణమ్మపై పగ సాధించడానికి సిద్ధపడ్డాడు. తనను అన్యాయంచేసి, తనజీవితాన్ని నాశనంచేసిన ఆ పిశాచిని హతమార్చాలనే సంకల్పాన్ని స్థిరపరచుకున్నాడు. ఆహారనిద్రలు విసర్జించాడు. ఎప్పుడూ అతని ఆలోచన రవణమ్మపై పగసాధించాలనే! రానురాను పిచ్చివాడై పోసాగాడు. అతన్నిచూస్తేనే భయంవేసేట్టుగా మారిపోయాడు. మనసులో యెప్పుడూ 'ప్రతీకారం! ప్రతీకారం!!' అంటూ జపిస్తూండేవాడు.

ఆరోజు ప్రొద్దుటే సూర్యం యింటి బయట అరుగుమీద దుప్పటికప్పుకుని పడుకునివున్నాడు. నిద్రలోనున్న సూర్యానికి రవణమ్మ వాకిలి వూడుస్తున్న శబ్దానికి మెలుకువవచ్చింది. కళ్ళువిప్పటికి రవణమ్మ ప్రత్యక్షమైంది. అతనికి ఆగ్రహంతో యెక్కడలేని ఆవేశమొచ్చింది. మొలలోనున్న బాకుతీసుకుని రవణమ్మవద్దకు ఒక్క పరుగునవెళ్ళి 'ప్రతీకారం!' అంటూ ఆమె డొక్కలో........రవణమ్మ నేలకూలి రక్తంలో గిజగిజాకొట్టుకుని...సూర్యం వికటాట్టహాసం చేసుకుంటూ యెక్కడికో మాయమైపోయాడు. ఎవరూ అతనిజాడ కనుగొనలేక పోయారింతవరకూ.


